

పాలిసెట్‌లో 95.36 శాతం మంది ఉత్తీర్ణత

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పాలిసెట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 6938 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 6616 మంది అర్హత సాధించారు. మొత్తం 95.36శాతం ఉత్తీర్ణులవ్వగా, వారిలో బాలికలు 97.44శాతం, బాలురు 93.9శాతం మంది ఉన్నారు. షేక్ అబ్దుల్ ముజీబ్ రాష్ట్రస్థాయిలో 171వ ర్యాంకుతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. చిల్ల పూర్ణ సంజయ్ 207వ ర్యాంకుతో జిల్లాలో రెండోస్థానం, మండల వాగ్దేవి 269వ ర్యాంకుతో మూడోస్థానంలో నిలిచారు.

విద్యతోనే భవిష్యత్తు... విద్య ద్వారా దేశాభివృద్ధి... అంటారు మన జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు. ఇంకొంచెం ముందుకు వెళ్తే విద్య తరగని గని... విద్య లేనివాడు వింత పశువు అని కూడా పెద్దలు అంటుంటారు. కానీ, ఆచరణలో నేటి పాలకులు ఉచిత విద్యను ప్రభుత్వం పేదలకు అందకుండా చేస్తోంది. అందుకే పాఠశాలల పునర్నవ్యవస్థీకరణ పేరిట ప్రస్తుతం ఉన్న మూడు రకాల పాఠశాలలను తొమ్మిది రకాలుగా మార్చేసి, పాఠశాలల సంఖ్యను తగ్గించాలని, తద్వారా ఉపాధ్యాయ పోస్టులనూ కుదించుకోవాలని భావిస్తోంది. దాదాపు ఇదే లక్ష్యంతో గత వైసిపి ప్రభుత్వం జిఒ నెంబర్ 117తో ముందుకు సాగింది. దీన్ని రద్దుచేస్తామని చెప్పిన సిఎం చంద్రబాబు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ కొత్తసీసాలో పాత సారా నింపిన మాదిరిగా అవే విధానాలతో తాజాగా జిఒ నెంబర్ 19,20,21ను జారీచేశారు. దీంతో, ప్రభుత్వం మారినప్పటికీ పేద, మధ్య తరగతి విద్యార్థులను విద్యకు దూరంచేసే విధానం మాత్రం కొనసాగనుంది.



విజయనగరంలో మూతపడనున్న పాఠశాల

పునర్ వ్యవస్థీకరణ పేరిట పాఠశాలల కుదింపు

- ఉపాధ్యాయ పోస్టులకు ఎసరు
- పేద, మధ్య తరగతి విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థానంలో 9 రకాల పాఠశాలలను ఏర్పాటు చేసింది. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేస్తూ జీవో 19,20,21లను విడుదల చేసింది. వీటి ప్రకారం ప్రకారం ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, మోడల్ ప్రైమరీ స్కూళ్లు, పిపి-1, పిపి-2 స్కూళ్లు, యుపి స్కూళ్లు, హైస్కూళు ,, ఏకోపాధ్యాయ స్కూళ్లు తదితర తొమ్మిది రకాల పాఠశాలలుగా మార్చనున్నారు. ఈ విధానం వల్ల పాఠశాలల సంఖ్య, ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గిపోవడం మినహా విద్యార్థులకు అదనంగా సమకూరే ప్రయోజనాలంటూ ఏమీ లేవన్నది ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాల వాదన. పరిస్థితులు కూడా ఇందుకు తగ్గట్టే కనిపిస్తున్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ 1,2వ తరగతులతో నడిచే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు ఉంటాయి. కొన్ని గ్రామాల్లో 1 నుంచి 10వ తరగతి వరకు నడిచే ఉన్నత పాఠశాలలు ఉంటాయి. ఇలాంటి చోట ప్రైమరీ, లేదా ఉన్నత పాఠశాలల్లో తమకు నచ్చిన పాఠశాలలకు పిల్లలను తల్లిదండ్రులు పంపుతారు. ఇటువంటి చోట పిల్లలు తక్కువగా ఉన్నారన్న నెపంతో ఆ గ్రామంలోని బేసిక్ ప్రైమరీ స్కూళ్లను తాజా విధానంగా ప్రభుత్వం ఎత్తివేస్తుంది. దీంతో కొన్నాళ్లకు బేసిక్ ప్రైమరీ స్కూళ్లు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడుతుంది. ప్రస్తుతం జిల్లాలో 1 నుంచి 5 వరకు నడిచే ప్రాథమిక పాఠశాలలు 1718 ఉన్నాయి. వీటిని విచ్ఛిన్నం చేయడం ద్వారా సుమారు 1482 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.

జిల్లాలో సుమారు 235కు పైగా యుపి పాఠశాలలను ఎత్తివేసేందుకు అవకాశం ఉన్నట్టుగా ఉపాధ్యాయ సంఘాలు విశ్లేషిస్తున్నాయి. పంచాయతీ కొక మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేసి అక్కడ తరగతికొక ఉపాధ్యాయుడ్ని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గిపోనుంది. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేస్తామని చెబుతోంది. మోడల్ ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే 3,4,5 తరగతుల విద్యార్థులు కనీసం 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ కారణాల రీత్యా పిల్లలను తల్లిదండ్రులు మోడల్ ప్రాథమిక పాఠశాలకు పంపించే అవకాశంలేదు. ప్రయాణ భత్యం ఇస్తామని చెపుతున్నా అది ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకంగా వుంది. ఉన్నత పాఠశాలల్లో కేవలం ఇంగ్లీష్ మీడియం ఒక్కటే అమలు చేయడం వల్ల మిగిలిన భాషా పండిత పోస్టులను ప్రభుత్వం ఇప్పటికే మిగులు పోస్టులుగా చూపుతోంది. ఇప్పటి వరకు 1:40 నిష్పత్తిగా ఉన్న ఉపాధ్యాయులు - విద్యార్థుల సంఖ్య 1:53గా పెరగనుంది. ఈ నేపథ్యంలోనూ మరికొన్ని మిగులు పోస్టులు ఉన్నట్టు ఇప్పటికే తేల్చారు.

మరోవైపు డిఎస్‌సిలోనూ 3వేల పోస్టులకు కోతపెట్టారు. ఉపాధ్యాయులు ఆశించిన ఉద్యోగోన్నతి ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ విధంగా ఉపాధ్యాయుల మధ్య చిచ్చురేపే విధానాలు కూడా ప్రభుత్వ ఉత్తర్వుల్లో కనిపిస్తున్నాయి. ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ప్రజలను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలకు ప్రభుత్వం అప్పగించింది. ఎమ్మెల్యేలు ద్వారా లేఖలు తీసుకొని మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చే ప్రయత్నం చేపడుతోంది. అయితే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని విద్యా శాఖకు సిఫార్సు చేయడం లేదు.

మరోవైపు ప్రభుత్వం అమలు చేస్తున్న మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు వల్ల నష్టం కలుగుతుందని, తమ పిల్లలు పాఠశాల విద్యకు దూరమవుతారని ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

నాణ్యమైన విద్య పొందలేరు



జీవో నెంబర్ 19 తో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యను తొమ్మిది రకాలుగా విభజించనుంది. అంగన్వాడీల నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విభజిస్తుంది. కానీ వారికి బోధించే వారిలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. . ఇలా చేయడం వలన ఫ్రీ ప్రైమరీగా చెప్పబడే అంగన్వాడీ పిల్లలు పౌష్టికాహారానికి, ఆటపాటలకు దూరమవుతారు. మరోవైపు అనేక పాఠశాలలో ప్రధానోపాధ్యాయ, పిఇటి పోస్టులు రద్దు చేయబడతాయి. ఇప్పటి వరకు 1:30 గా ఉన్న విద్యార్థులు అధ్యాపకులు నిష్పత్తి కొన్ని సందర్భాల్లో ఎక్కువయ్యే పరిస్థితి ఉంది. ఇంటర్ విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు బోధించడం వలన వారు నాణ్యమైన విద్యను పొందలేరు. వయసుతో సంబంధం లేకుండా ఒకటి నుండి 12 తరగతి విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో ఉంచడం కూడా విద్యార్థుల మధ్య. ఘర్షణలకు తావిస్తుంది.

- డి.రాము, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

విద్య నుంచి దూరం చేయడమే..



విద్యారంగం నుంచి ప్రభుత్వం బాధ్యత తగ్గించుకుని, ఆ మేరకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు లాభాలు చేకూర్చడమే పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ విధానం వల్ల పాఠశాలల కుదింపు, ఉపాధ్యాయ పోస్టుల తగ్గింపే ప్రధానాంశంగా కనిపిస్తోంది. ఈ విధానానికి యుటిఎఫ్ పూర్తిగా వ్యతిరేకం. దీనికి వ్యతిరేకంగా పోరాడతాం. గత ప్రభుత్వమూ ఇదే విధానం అమలు చేసి అధికారాన్ని కోల్పోయింది. ఈ విధానాన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చికూడా తిరిగి అదే విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది.

- కె.విజయగౌరి, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

శివారు ప్రాంతాలపై నిఘా

అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలి : ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

శివారు ప్రాంతాలపై నిఘా పెంచి అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న పోలీసు అధికారులతో బుధవారం మాసాంతర నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ 112/శక్తి యాప్ కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని, సమస్యలను పరిష్కరించాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. రాత్రి 11గంటల తరువాత సహేతుకరమైన కారణం లేకుండా సంచరించే వారిపై టౌన్ న్యూసెన్సు కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణపై దృష్టి పెట్టాలని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నాలుగు చెక్ పోస్టులు వద్ద నిరంతరం వాహన తనిఖీలు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రౌడీలు, సస్పెక్ట్స్, ఇతర హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తులు మళ్లీ నేరానికి పాల్పడకుండా కౌన్సిలింగు చేయాలని, వారి కదలికలపై నిఘా పెట్టాలన్నారు. వేసవిలో దొంగతనాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశం ఉన్నందున, నియంత్రణ చర్యలు చేపట్టాలని తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషనుకు పరిధి ప్రారంభం, ముగింపు ప్రాంతాల వద్ద స్టాపర్లును, బ్యారికేడ్లు, సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద, దేశ

ప్రముఖుల విగ్రహాలు వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. లేడిస్ హాస్టల్స్ వద్ద కాంపౌండ్, వాచ్మెన్, సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, ఇన్ అండ్ అవుట్ రిజిస్టర్లును ఆయా హాస్టల్స్ యజమాన్యం మెయింటెయిన్ చేసే విధంగా చూడాలన్నారు. నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేయాలని, రోడ్డు ప్రమాదాల్లోని హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించేందుకు రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపాలన్నారు. వివిధ పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించి, వివిధ కేసుల ఛేదనలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, మహిళా పిఎస్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, డిటిసి డిఎస్‌పి ఎం.వీరకుమార్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సహ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమాచార హక్కు చట్టం 2005 పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. ప్రతి సచివాలయ పరిధిలో సమాచార హక్కు చట్టంపై కార్యదర్శులు బుధవారం సదస్సులు నిర్వహించారు. బ్యానర్లతో ప్రచారం చేసి సదస్సులు నిర్వహించి ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యకలాపాలు ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో సమాచార హక్కును ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిందన్నారు. దరఖాస్తు చేసుకోవడం ఎలా సమాచారం పొందడం ఎలా ఎన్ని రోజుల్లో సమాచారం పొందాలి సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో ఏవిధంగా ముందుకు సాగాలి అన్న విషయాలను సాధారణంగా వివరిస్తున్నామన్నారు.

అద్దె చెల్లించని దుకాణాలు మూత

నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న దుకాణాల అద్దెలు చెల్లించని దుకాణాలను రెవెన్యూ సిబ్బంది మూసివేసి తాళాలు వేసారు. బుధవారం రెవెన్యూ సిబ్బంది న్యూ ఐడియస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు దుకాణాలను సీజ్ చేశారు. చాలాకాలంగా అద్దె బకాయిలు పేరుకుపోవడంతో సదరు దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ అద్దెలు చెల్లించలేదు. దీంతో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది ఆయా దుకాణాలను మూసివేసి త్వరితగతిన అద్దెలు చెల్లించాలని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ అన్నారు. పట్టణంలోని రాజా కళాశాల రోడ్డులో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, హెల్మెట్ ధరించాలని, వాహనాలకు అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఆయనతో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



జీపు జాతా ముగింపు సభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

పెట్టుబడిదారుల ప్రయోజనాలకే లేబర్ కోడ్‌లు

- జిల్లాలో మూతపడిన పరిశ్రమలను తెరిపించాలి
- 20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి
- జీపు జాతాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా ఈనెల 20న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఈనెల 10న చేపట్టిన ప్రచార జీపు జాతా బుధవారం సాయంత్రం కోట వద్ద ముగిసింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు, స్కీం వర్కర్లు జాతా నాయకులకు స్వాగతం పలికారు. అనంతరం సిఐటియు నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహన్‌రావు అధ్యక్షత జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ కనీస వేతనం అమలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రవేటీకరణ ఆపాలని, స్కీమ్‌వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ రద్దు, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకు ఈనెల 20న దేశ వ్యాప్తంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. కేంద్రంలోని మోడీ సర్కారు కార్మిక చట్టాలనురద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికుల మెడకు ఉరితాడు బిగిస్తోందని అన్నారు. జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోడీ ప్రభుత్వం విద్యుత్, రవాణా, బ్యాంకులు ఇన్సూరెన్స్, స్టీల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తుంటే అమలు చేయడం లేదన్నారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి రోజుకు 600 రూపాయలు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ వి.లక్ష్మి మాట్లాడుతూ సార్వత్రిక సమ్మె సందర్భంగా 17 డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం అమలు చేయడం లేదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించలేదని విమర్శించారు. జిల్లాలో 13 జ్యూట్ పరిశ్రమలను మూసివేసారన్నారు. జిల్లాకు చెందిన పరిశ్రమ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మూసి వేసిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎఐఎఫ్‌టియు న్యూ రాష్ట్ర కమిటీ సభ్యులు బెహరా శంకరరావు మాట్లాడుతూ కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం రద్దు చేస్తోందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికులు ఐక్యంగా సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సిఐటియు పట్టణ ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ హక్కులు నిలబడాలంటే మనమంతా మోడీపై కలబడాలని పిలుపునిచ్చారు. ఎ.జగన్మోహన్ మాట్లాడుతూ దేశంలో తొంబై తొమ్మిది శాతం ఉన్న కార్మికులను కాకుండా ఒక్క శాతం ఉన్న పెట్టుబడిదారులకు అనుకూలంగా మోడీ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మతం,జాతి కులం ,సంఘాల అడ్డుపెట్టుకొని అందర్నీ చీల్చుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి యు.ఎస్.రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు టివిరమణ, బి.సుధారాణి, ఎం.శ్రీనివాస, అంగన్ వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడి రాజు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

కొత్తవలస: సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు పిలుపునిచ్చారు. బుధవారం దేవాడ డేగల చెరువులో పని చేస్తున్న ఉపాధి కూలీలతో మాట్లాడారు. ఉపాధి చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. అందులో భాగంగా ఈ నిధులు 40 శాతం దారి మళ్లించి ఉపాధి కూలీల పొట్టకొడుతున్నాయన్నారు. గతంలో కార్మికులకు ఇచ్చిన అలవెన్స్ పూర్తిగా రద్దు చేశారన్నారు. రెండు పూట్ల పని పెట్టడం సకాలంలో కూలి డబ్బులు చెల్లించకపోవడం చట్టాన్ని నిర్వీర్యం చేయడంలో భాగమేనన్నారు. ఈ దుర్మార్గపు విధానాలను తిప్పుకొట్టేందుకు చేపడుతున్న ఈ సమ్మెలో ఉపాధి కార్మికులు, మేట్లు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కొత్తవలసలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు

ఉష్ణతాపం నుంచి ఉపశమన చర్యలు

జిల్లావ్యాప్తంగా లక్ష మొక్కలు నాటాలి

వచ్చే శనివారం బీట్ ద హీట్‌పై స్వచ్ఛాంధ్ర కార్యక్రమం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

వేసవిని దృష్టిలో ఉంచుకొని ఈనెల 17న మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఉష్ణతాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మండల, జిల్లా అధికారులను ఆదేశించారు. వచ్చే నెల రోజులపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉన్నందున జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో వేసవి నుంచి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని బీట్ ద హిట్ పేరుతో నిర్వహిస్తోందని, దీనిలో భాగంగా జిల్లాలో అన్ని గ్రామాలు పట్టణాల్లో ముఖ్య ప్రదేశాలు, జన సమూహాలు ఉండే ప్రదేశాలలో తాగునీటి సౌకర్యం కల్పించే చర్యలు చేపట్టాలన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నీడనిచ్చే లక్ష మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికి అవసరమైన మొక్కలను జిల్లా అటవీ శాఖ అధికారి సరఫరా చేయాలని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు బహిరంగ ప్రదేశాలు రోడ్ల పక్కన పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. వేసవిలో వద్ధులు పిల్లలు వంటి వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా గ్రామాలు పట్టణాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖకు ఆదేశించారు. వేసవిలో డీహైడ్రేషన్ కు గురయ్యే అవకాశం ఉన్నందున తగిన సంఖ్యలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను సిద్ధం చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించేలా ప్రభుత్వ అధికారులు ఉద్యోగులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ శ్రీనివాసమూర్తి, సిపిఒ పి.బాలాజి, జెడ్‌పి సిఇఒ బివి సత్యనారాయణ, డిపిఒ టి.వెంకటేశ్వరరావు, కార్పొరేషన్ కమిషనర్ పి.నల్లనయ్య, అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, కమిషనర్లు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

వంగరలో వడగళ్ల వాన

బూరాడపేటలో పిడుగుపడి 8 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - వంగర, సంతకవిటి, నెల్లిమర్ల



నెల్లిమర్ల : పిడుగుపడి మృతి చెందిన గొర్రెలు

జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. వంగరలో వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. నెల్లిమర్ల మండలం పెదబూరాడపేటలో పిడుగుపడి 8 గొర్రెలు మృతి చెందాయి. సంతకవిటిలో మోస్తారు వర్షం కురిసింది. ఎండ వేడిమితో అల్లాడిన ప్రజలకు ఉపశమనం లభించింది. పలు గ్రామాల్లో గాలి వర్షానికి చెట్లు నేలకొరిగాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వంగర మండలం శివ్వాం, మడ్డువలస, వంగర గ్రామాల్లో ఇళ్లల్లో నీరు చేరడంతో పాటు, మరుగునీరు రోడ్లపై నిల్వ ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గజపతినగరం మండలంలో చాలాచోట్ల చిరుజల్లులు కురిశాయి. గాలులతో మొక్కజొన్న రైతులు ఆందోళన చెందారు. విజయనగరంలో మోస్తారు వర్షం కురిసింది. గాలులకు ఫెక్సీలో ఒరిగిపోయాయి. రామభద్రపురం, చీపురుపల్లి, తదితర మండలాల్లో వర్షం కురిసింది.

నెల్లిమర్ల మండలం పెద బూరాడ పేటలో పిడుగు పడి 8గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన డొప్ప త్రినాధ్ గొర్రెలు మేపుతుండగా ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. దీంతో పొలంలో ఉన్న 8 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో గొర్రెల కాపరి త్రినాధ్ ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

పోక్సో కేసులో వృద్ధుడికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

మహిళా పోలీసు స్టేషన్లో 2023 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడు విజయనగరానికి చెందిన కింతాడ అంజిబాబు (72)కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి బుధవారం తీర్పు చెప్పారు. విజయ నగరానికి చెందిన నిందితుడు కింతాడ అంజిబాబు ఇంటి మేడపై ఆడుకుంటున్న ఆరేళ్ల బాలికను లైంగికంగా వేధించినట్లు బాలిక తల్లి మహిళా పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్ఐ కెటిఆర్ లక్ష్మి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో అంజిబాబుకు మూడేళ్ల జైలుతో పాటు వెయ్యిరూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశాలు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని వెంకటగిరి ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హేండ్‌లూమ్ టెక్నాలజీ 3 ఏళ్ల డిప్లమో కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఒఎస్‌డి ఎస్.గిరిధరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంస్థలో 53 సీట్లు, తమిళనాడు సేలంలోని 12 సీట్లు, కర్నాటకలోని గడగ్‌లో 4 సీట్లకు ప్రవేశాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పదో తరగతి తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై, వయసు ఈ ఏడాది జులై 1 నాటికి 15 నుంచి 23 ఏళ్ల మధ్య ఉండాలని, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు వయసు 25ఏళ్ల వరకు ఉండవచ్చునని తెలిపారు. ఇంటర్ ఎంపిసి, ఒకేషనల్(టెక్స్‌టైల్స్), ఐటిఐ రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులైనవారు ఈ డిప్లమో కోర్సులో నేరుగా రెండవ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఐఐహెచ్‌టివిజిఆర్. కామ్‌కు లేదా08625-295003, 9399936872, 9866169908, 9010243054కు సంప్రదించవచ్చునని సూచించారు.

పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయి

ఎబి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వరూప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అవార్డులు, పురస్కారాలు సామాజిక సేవలో మరింత బాధ్యతను పెంచుతాయని అహల్య భాయ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఎమ్మెస్ స్వరూప్ పేర్కొన్నారు. ఎబి చారిటబుల్ ట్రస్ట్‌కు ఇటీవల ఇండో యూరోపియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించడం పట్ల బుధవారం పట్టణంలోని యేసు ప్రేమాలయంలో అభినందన సభ జరిగింది. నగరానికి చెందిన పలువురు పాస్టర్లు ట్రస్ట్ నిర్వాహకుడు డాక్టర్ ఎం.ఎస్ స్వరూప్ ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు, సత్కార గ్రహీత డాక్టర్ ఎం.ఎస్ స్వరూప్. మాట్లాడుతూ సమాజంలోని పలువురు అనాధ పిల్లలకు ఆశ్రయం కల్పించి ఆదుకోవడంతోపాటు తల సేమియా రోగులకు ఉచిత స్వచ్ఛంద రక్తదానం, క్యాన్సర్ పేషెంట్లకు ఉచితంగా నిరంతరం మందులు పంపిణీ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులు ఉచితంగా అందజేయడం, వంటి కార్యక్రమాలు నిర్విరామంగా చేయడం వల్ల అవార్డు లభించిందని వివరించారు. ఈ ప్రోత్సాహంతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవరెండ్ స్టీవెన్ పాల్సన్, రెవరెండ్. వివేకానంద్, రెవరెండ్ ఆంథ్రేయ, రెవరెండ్ నిర్మల ,రెవరెండ్ జాకబ్, జాన్, కె. సూర్యనారాయణ, విన్స్టన్, ఏసుదాసు, విక్టర్ బాబు ,విద్యాసాగర్, సువార్తమ్మ, శశికళ దేవి ,రమ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - తెర్లాం


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మండలంలోని లింగాపురం నుండి అంట్లవార మధ్య రోడ్డుకు ఎమ్మెల్యే బేబీనాయన, బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ2.4 కోట్ల అంచనాతో ఈ రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. అనేక సంవత్సరాల నుంచి పనులు ప్రతిపాదించడం తప్ప పనులు ప్రారంభించని లేదని, ఇప్పుడు ఈ పనులు ప్రారంభించడం వల్ల ఆయా గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఛైర్మన్ నర్సుపల్లి వెంకట్ నాయుడు మాజీ ఎంపిపి, మాజీ జెడ్‌పిటిసి ప్రతినిధి నర్సుపల్లి వెంకటేష్, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ప్రజాశక్తి - గంట్యాడ

అక్రమంగా మట్టిని తరలించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో విఆర్‌ఒలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి తవ్వకాలకు వినియోగించిన యంత్రాలను చట్టపరంగా సీజ్ చేస్తామన్నారు. ఆయా గ్రామాల రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేసిన విఆర్‌ఒలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డిటి హరికిరణ్, ఆర్‌ఐ ప్రసాద్, విఆర్‌ఒలు తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి - వేపాడ

మండంలోని బొద్దాంలో పైడిమాంబ పండగ సందర్భంగా మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారులు నృత్యంతో ఉర్రూతలూగించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పైడితల్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - రాజాం

పట్టణంలోని శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మ ఆలయంలో బుధవారం హుండీ లెక్కించారు. ఆలయ ఇఒ మాధవరావు ఆధ్వర్యంలో చీపురుపల్లి కనకమహాలక్ష్మి ఆలయం ఇఒ శ్రీనివాసు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. రెండు నెలలకు గాను రూ.3,24,800 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త వాకచర్ల దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే భూసారం

ప్రజాశక్తి - రేగిడి


రైతులకు నవధ్యానాలను అందిస్తున్న ఎఒ

నవధాన్యాలు సాగుతోనే భూసారం పెరుగుతుందని, ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని ఎఒ మురళీ కృష్ణ, ప్రకృతి వ్యవసాయ విభాగం ఎన్‌ఎఫ్‌ఎన్ టి.పద్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు నవధాన్యాలు కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకరా పొలంలో 12 కేజీలు నవధాన్యాల వేయడంతో భూమి సారవంతం అవుతుందన్నారు. దుంప జాతి, పచ్చిరొట్ట, పప్పుజాతి, తీగజాతి, ఆకుకూరలు, కాయగూరలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, సుగంధ ద్రవ్యాలు, తృణ ధాన్యాలు తొమ్మిది రకాలు వేస్తే నేల గుల్ల పడి చీడపీడల నివారిస్తుందన్నారు. తద్వారా పంటలు దిగుబడి వస్తుందని వెల్లడించారు. ప్రతి రైతు నవధాన్యాలు కిట్లు తీసుకుని వెళ్లి పంట పొలాల్లో వేయాలని సూచించారు. వీరితోపాటు ఐసిఆర్పిఎస్ రవి, వరలక్ష్మి, శ్రీదేవి, రమా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మిత్ర కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆరోగ్యమిత్ర ఎస్.గౌరునాయుడు కుటుంబ సభ్యులకు తోటి ఉద్యోగులు ఆర్థిక సహాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పక్కి గ్రామానికి చెందిన గౌరునాయుడు విధులు ముగించుకుని ఇంటికి ఆటోలో వెళ్తుండగా జారిపడి ఇటీవల మృతి చెందారు. మృతుని భార్య సరస్వతి పేరు మీద రూ.71వేలు పోస్టాఫీసులో డిపాజిట్ చేసి బాండును కె.శంకరరావు, రాంబాబు, కుమార్ బుధవారం ఆమెకు అందించారు. తమతో పని చేసి మరణించిన గౌరునాయుడు కుటుంబానికి అండగా ఉంటామని ఆరోగ్య మిత్రలు చెప్పారు.

విజ్ఞాన తరగతులతో చురుకుదనం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

వేసవి విజ్ఞాన తరగతులు ద్వారా పిల్లలకు చురుకుదనం అలవడుతుందని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ అన్నారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా బుధవారం రవీంద్ర భారతి స్కూల్ టీచర్ త్రినాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్ నేర్పించారు. చదరంగం, క్యారం బోర్డు, ఇతర ఆటలు కూడా విద్యార్థులు ఆడుకున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 28 విద్యార్థులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుకు అవార్డు

ప్రజాశక్తి - డెంకాడ



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్స్‌గా విధులు నిర్వహిస్తున్న ఇ.మీనాకుమారి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడకు చెందిన హెల్త్ కేర్ ట్రస్ట్ ఏటా ఉత్తమ సేవలు అందిస్తున్న స్టాఫ్ నర్స్‌ల కోసం నిర్వహిస్తున్న అవార్డుల ఎంపికలో భాగంగా ఈ ఏడాది జిల్లా నుంచి డెంకాడ పిహెచ్‌సి స్టాఫ్ నర్స్ మీనా కుమారికు అవకాశం దక్కింది. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డు అందుకోనున్నారు. దీంతో ఆమెను పిహెచ్‌సి డాక్టర్లు, తోటి సిబ్బంది అభినందించారు.

రూ.10వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పాడి ఆవులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బాధితుడు నిరుద్యోగి కృష్ణకు వేపాడకు చెందిన 'మన నేస్తం' స్వచ్ఛంద సంస్థ సభ్యులు బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.

హరిత సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రం

ప్రజాశక్తి - వేపాడ



చలివేంద్రం వద్ద మజ్జిగ తాగుతున్న ప్రజలు

అధిక వేసవి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సొసైటీ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు తెలిపారు. జగ్గయ్యపేటలో బుధవారం హరిత సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణీకుల దాహార్తిని తీర్చడానికి జగ్గయ్యపేట స్వామి వివేకానంద విగ్రహం వద్ద మజ్జిగ పంపిణీ చేసి మాట్లాడారు. ఎండలు విపరీతంగా ఉన్న కారణంగా వేసవికాలం పూర్తయ్యే వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు. యువత ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని గ్రామ సర్పంచ్ ప్రతినిధి వంటాకు శ్రీను, గ్రామ పెద్దలు రొంగలి అప్పారావు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రావాడ రాము, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, హరిత సొసైటీ సభ్యులు ఆర్.దేవుడుబాబు, పి.మహేష్ ఆర్.కృష్ణ, ఎస్.అప్పల సూర్యనారాయణ, సి.హెచ్ త్రినాథ్, సి.హెచ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన లోపం.. పాడి రైతులకు శాపం

◆ గోకులాలపై అంతంత మాత్రంగానే సమాచారం ◆ దరఖాస్తులు చేసుకోవాలన్నా ఇబ్బందులే ◆ మండలంలో 4 గోశాలలు మాత్రమే పూర్తి

ప్రజాశక్తి - సంతకవిటి

మండలంలోని పశుసంవర్థక శాఖ, ఉపాధి హామీ అధికారుల సమన్వయంతో మినీ గోకులాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది. వాటి పర్యవేక్షణ కూడా వారి బాధ్యతే. అయితే వారు పట్టించుకోకపోవడంతో దరఖాస్తులు పెట్టిన వారికి కూడా గోకులాలు మంజూరు కాలేదు. దీంతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో గోశాలలు లేక మూగ జీవులు నానా ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి నెలకొంది. రానున్న వర్ష కాలంలో మరింత ఇబ్బందిగా మారుతుందని పాడిరైతులు చెబుతున్నారు. అయితే మండలంలోని పాడి రైతులు గోశాలలు కోసం దాదాపు 6నెలలు క్రితమే దరఖాస్తులు చేసుకున్నారు. సంబంధిత అధికారులు మంజూరు చెయ్యకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

> **గోవులను సంరక్షించేందుకు గోకులాలను నిర్మించి రైతులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి రైతులకు రాయితీతో కూడిన ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చింది. అయితే దీనిపై రైతులకు అవగాహన కల్పించడంలో యంత్రాంగా పూర్తిగా విఫలమైంది. ఫలితంగా రైతులు ఈ పథకాన్ని సక్రమంగా వినియోగించుకోలేకపోయారు. కొంత మందికి తెలిసినప్పటికీ నిర్మాణాలు మాత్రం పూర్తి చేపట్టలేకపోయారు. మండలంలో 110 మంది దరఖాస్తులు చేసుకోగా కేవలం 12 మాత్రమే మంజూరు కావడం అందులో కేవలం 4 మాత్రమే పూర్తికావడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దీంతో గోవులు ఎండ, వానల్లో ఇబ్బందులు పడుతున్నాయి..**

కేవలం 4 గోశాలలు మాత్రమే పూర్తి

మండలంలోని గోశాల కోసం ఆరు నెలలు క్రితం 110 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 12 మాత్రమే మంజూరు కాగా అందులో 4 గోశాలలు మాత్రమే పూర్తి చేశారు. 56 గోశాలలు ఇంకా మంజూరు కావాల్సి ఉంది. మరో 40 గోశాలలుకు ప్రతిపాదనలు వేశారు. గోశాలలు అన్ని పూర్తయ్యేసరికి మరో సంవత్సరం పడుతోందని రైతులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

పాడి రైతులు ప్రభుత్వ సాయం కోసం దరఖాస్తులు చేసుకున్నా వారికి సకాలంలో సాయం అందడం లేదని లబ్ధిదారులు విమర్శిస్తున్నారు. గోకులాలు నిర్మించుకుంటామని నిధులు మంజూరు చేయాలని పాడి రైతులు అధికారులు చుట్టూ తిరగడమే తప్ప వారికి నిధులు మంజూరు చేయడం లేదని పాడి రైతులు వాపోతున్నారు. దీనికి కేవలం అధికారుల నిర్లక్ష్యమే కారణంగా తెలిసోంది. గతంలో మండలంలోని పులి సంచరించడంతో పాడి రైతులు భయాందోళన చెందారు. లబ్ధిదారులకు గోశాలలు లేక అరుబయటే ఉన్న గోవులను పులి గాయపరిచిన ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఇలాంటి పరిస్థితిలు మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలంటే గోకులాలు ఉండాలని రైతులు చెబుతున్నారు.

దరఖాస్తులు చేసుకోవాలంటే ఇబ్బంది పడాల్సిందే

గోశాలలు కోసం దరఖాస్తులు పెట్టాలంటే పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి, రెవెన్యూ అధికారులతో


చెట్ల నీడలో సేదతీరుతున్న గోవులు

పొజిషన్ సర్టిఫికెట్ తీసుకుని, పశుసంవర్ధక శాఖ అధికారులకు దరఖాస్తులను సమర్పిస్తే ఎంపిడిఒ కార్యాలయంలో వెరిఫికేషన్ చేసి, చివరికి ఎన్ఆర్ఈజిఎస్ కార్యాలయానికి పంపిస్తారు. ఇదంతా జరిగినా మంజూరుకు వచ్చేసరికి బ్రేకులు వేస్తున్నారు. దీంతో పాడి రైతులు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణులు చేస్తున్నారు.

అవగాహన లోపం

మండలంలోని పాడి రైతులకు గోకులాలపై అవగాహన లేక ఇబ్బందులు పడ్డారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పాడి పశువులు, కోళ్ల పెంపకందారులు ప్రయోజనం పొందేందుకు ఉన్న అవకాశాలపై అవగాహన లోపించింది. పల్లె ప్రాంతాల్లో కూడా దరఖాస్తులు సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. మంజూరైన వాటి పనుల పర్యవేక్షణ, చెల్లింపుల్లోనే జాప్యం జరుగుతుంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పాడి రైతులు కోరుతున్నారు.

అమ్మో..! రైల్వే గేటు

◆ పురిటిపెంట రైల్వే గేటుతో ఇబ్బందులు
◆ ఒకసారి పడితే అరగంట ఆగాల్సిందే
◆ అవస్థలు పడుతున్న వాహనదారులు
◆ స్పందించని ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండల కేంద్రం నుంచి మెంటాడ మండలానికి వెళ్లే రహదారిలో పురిటిపెంట న్యూకాలనీ వద్ద ఉన్న రైల్వే గేట్ వాహనదారుల సహనానికి పరీక్షలు పెడుతోంది. రైలు వచ్చిపోయే వేళల్లో తరచూ గేటు వేయడంతో ఎండలో గంటల తరబడి దుమ్ము, ధూళి మధ్య వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే గేటు సమస్యతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఒక్కోసారి గేటు పడితే పట్టణానికి వెళ్లేవాళ్లు, వచ్చేవాళ్ళు రెండుపక్కల ప్రజలు ఎక్కడిక్కడ నిలిచిపోవాల్సిన పరిస్థితి ఉంటోంది. ఒక్కోసారి రెండు రైళ్లు వెళ్లే సమయంలో పావుగంట నుంచి అరగంట వరకు వేచి ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు కొన్నిసార్లు రైలు వెళ్లిపోయిన తర్వాత కూడా గేటు పైకి లేవడానికి మొరాయిస్తుందని, వెంటనే మరమ్మతులు కూడా చేయాలని చెబుతున్నారు. గుర్లతమ్మిరాజుపేట, పిట్టాడ, సాలిపేట, ఇప్పలవలస, జయతి, చల్లపేట, పాతబగ్గాం, గంగుచోళ్లపెంట, చిట్టయ్యవలస ఇలా మెంటాడ, ఆంద్ర ఇలా సుమారు వంద గ్రామాల ప్రజలు ఇదే రోడ్డు మార్గం గుండా


గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనాలు

ప్రయాణాలు సాగిస్తుంటారు. పురిటిపెంట, గంగచోళ్ల పెంట మీదగా మెంటాడ, అనంతగిరి మండలాలకు చెందిన ప్రజలు రైల్వే ట్రాక్ దాటుకునే ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో గేటు పడిందంటే చాలు వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. కొంతమంది వాహనదారులు ప్రజాశక్తితో మాట్లాడుతూ.. వైద్య చికిత్సలు వంటి అత్యవసర పరిస్థితుల్లో అవస్థలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడో ట్రాక్ ప్రారంభమైతే రోజుకు ఎన్నిసార్లు గేటుపడుతుందోనని వాహన చోదకులు ఈ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఆర్‌ఒబి(రైల్వే వంతెన) నిర్మాణానికి కృషి చేయాలని కోరుతున్నారు. దీనికి తోడు నాలుగో లైన్ వస్తుందని ప్రచారం నేపథ్యంలో మరింత ఆందోళన చెందుతున్నారు.

108 వాహనాలకూ తప్పని పాట్లు

చాలా సందర్భాల్లో గేటు పడిన తరువాత 108 వాహనాలు కూడా నిలిచిపోవాల్సి పరిస్థితి ఎదురవుతోంది. దీంతో గర్భిణులు, బాలింతులు, ప్రమాదకర పరిస్థితిలో ఉన్న రోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు గేటు పడిన తరువాత 108 వాహనం నిలిచిపోవడంతో అందులోనే ప్రసవం జరిగిన సందర్భాలు ఉన్నాయి. మరికొన్ని సార్లు సమయానికి వైద్యం అందక ప్రాణాలు కూడా కోల్పోయిన పరిస్థితులు దాపురించాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రి తన స్వంత నియోజకవర్గంపై దృష్టి సారించి రైల్వే వంతెన నిర్మించి ప్రజల రాకపోకలకు ఎటువంటి అంటకమూ లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - రామభద్రపురం

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణాపై నిఘా ఉంచామన్నారు. వీటి నిరోధానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు బానిసవ్వడం వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు, బాల్య వివాహాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, వీటిని ప్రోత్సహించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా ప్రమాదాలు జరిగిన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇక్కడ ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆక్రమణలు తొలిగించే చర్యలు జరుగుతున్నాయని ప్రజలు, వ్యాపారులు సహకరించి స్వచ్ఛందంగా తొలగింపులు చేసుకోవాలన్నారు. ఈ సందర్శనలో బొబ్బిలి రూరల్ సిఐ కె. నారాయణరావు పాల్గొన్నారు.

'బ్యాడ్మింటన్' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - శృంగవరపుకోట


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

పట్టణంలోని కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలో గత 13 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరంలో బుధవారం ఉదయం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేతుల మీదుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బ్యాడ్మింటన్ కోచ్, బిఎఐ జాతీయ గ్రేడ్ వన్ కోచ్ గుంద్రోతు శ్రీనివాసరావు రాసిన బ్యాడ్మింటన్ స్ట్రోక్ ఎనలైజేషన్ అండ్ లెర్నింగ్ అనే బ్యాడ్మింటన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. 100 మంది క్రీడాకారులు, అతిథుల సమక్షంలో ఈ పుస్తకావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ పుస్తకం రచయిత శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక క్రీడాకారుడిగా ఎస్‌కోట కేంబ్రిడ్జ్ నారాయణ పాఠశాలలోనే తన క్రీడా ప్రస్థానం మొదలైందని, అంతటితో ఆగకున్నా క్రీడాకారుడిగా జిల్లా రాష్ట్ర స్థాయిలో ఎదిగి కోచ్‌గా ఇదే పాఠశాలలో ఆరంగేట్రం చేశానన్నారు. బ్యాడ్మింటన్‌లో తనకంటూ ఒక సుస్థిర స్థానం సంపాదించుకోవాలని దృఢ సంకల్పంతో తన కోచ్ శ్రీరాములు, మురళీ కృష్ణల సహకారంతో ఈ పుస్తక రచన ప్రారంభించానన్నారు. ఒక క్రీడాకారుడు మూడు నెలల్లో ఏ విధంగా బ్యాడ్మింటన్‌లో అభివృద్ధి చెందుతాడో ఈ పుస్తకం ద్వారా వివరించానన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ శ్రీనివాసరావు చిన్నతనం నుంచి తెలుసని, ఇలాంటి అద్భుతమైన బ్యాడ్మింటన్ పుస్తకం రాయగలడని తాను ఎప్పుడూ ఊహించలేదని చెప్పారు. ఇది విజయనగరానికే పరిమితం కాకుండా రాష్ట్ర స్థాయిలో దీనికి గుర్తింపు వచ్చేలా ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్‌లో ప్రస్తావిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యశేఖర్, చీఫ్‌కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, డాక్టర్ మల్లా వేణు, డాక్టర్ రంది కిషోర్, ఆనల మోహన్, కోచ్‌లు మహమ్మద్ ఖలీలుల్లా, బర్నికాన హారిక, పి.మౌనిక శేఖర్, పొలిమేర దేవుడు, తల్లిదండ్రులు, 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.


పైసలిస్తేనే పనులు

● ఎసిబికి పట్టుబడ్డ విఆర్‌ఒ ● అక్రమార్కులకు రెవెన్యూ అధికారుల దన్ను

ప్రజాశక్తి - జామి


ఎసిబికి పట్టుబడ్డ విఆర్‌ఒ వేణు(ఫైల్)

రెవెన్యూ శాఖలో పైసలిస్తేనే పనులు జరిగుతాయన్న నానుడిని జామి మండల రెవెన్యూ అధికారులు నిజం చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహమూ లేదు. తాజాగా మండలంలోని అలమండ గ్రామానికి చెందిన విఆర్‌ఒ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకి పట్టుబడడం అందుకు నిదర్శనం. గతంలో రెవెన్యూ శాఖపై అవినీతి నిరోధక శాఖ పలుమార్లు దాడులు నిర్వహించింది. అప్పట్లో ఓ అధికారి తృటిలో ఏసిబి వల నుంచి తప్పించుకున్నట్లు సమాచారం. అంతక ముందు మండల సర్వేయరు ఎసిబికి చిక్కారు. మండలంలో ప్రధానంగా జామి అగ్రహారం, తాండ్రంగి ప్రాంతాల్లో ఇనామ్ వంటి భూములు ఉన్నాయి. ప్రధానంగా చిన్న చిన్న కమతాలతో చిన్న సన్నకారు రైతులే ఎక్కువ మంది ఉన్నారు. దీంతో రెవెన్యూ సమస్యలు ఎక్కువగానే ఉన్నాయి. వీటిని రెవెన్యూ విఆర్‌ఒ స్థాయి అధికారులు అవకాశంగా మలుచుకుని డబ్బులు వసూలు చేయడం పరిపాటీగా మారిందిని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రదానంగా మ్యూటేషన్ వంటి చిన్న పనులకు కూడా వేలకు వేలు వసూలు చేస్తున్న పరిస్థితి ఉన్నట్లు తెలిస్తోంది. మండల కేంద్రంలోని అగ్రహారం భూములకు సంబంధించిన 7.5 ఎకరాల ఇనామ్ చెరువుకు సైతం జామి రెవెన్యూ అధికారులు పట్టదారు పాసుపుస్తకాలు ఇచ్చాశారంటే, ఎంతటి గటుకులో వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ చెరువు మాది, అది అక్రమణలో ఉంది, ఆక్రమణలు తొలగించి, చెరువుకి సరిహద్దులు గుర్తించాలని ఇరిగేషన్ శాఖ కొంతకాలంగా రెవెన్యూ శాఖకు లెటర్లు రాస్తున్నా, కిమ్మని అనడం లేదు. ఈ నేపథ్యంలోనే గ్రామంలోని ఓ న్యాయ వాది చెరువు కబ్జా ఫై లోకాయుక్తకి ఫిర్యాదు చేశారు. త్వరలోనే రెవెన్యూ అధికారులకు నోటుసులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇలా జామి రెవెన్యూ ఆగడాలు అనేకం. ఇప్పటికైనా ఉన్నతధికారులు స్పందించి జామి రెవెన్యూ అధికారులు పనితీరుపై సమగ్ర విచారణ చేపట్టి, సామాన్యులకు, రైతాంగానికి పారదర్శిక సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, లేని యెడల సామాన్యులు ఎసిబిని ఆశ్రయించే పరిస్థితులు ఇంకా పెరిగే అవకాశాలు ఎక్కువుగా ఉన్నాయని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు.


తహశీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్‌డిఒ కీర్తి

రీ సర్వేను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - బొండపల్లి

మండలంలోని బిళ్లలవసల గ్రామంలో జరుగుతున్న రీ సర్వేను ఆర్‌డిఒ దాట్ల కీర్తి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిళ్లవలసలో 954 ఎకరాలు భూములుండగా ఈ నెల 10 నుంచి నేటి వరకూ 80 ఎకరాల్లో రీ సర్వే పూర్తి చేశామన్నారు. గతంలో రీసర్వే జరిగిందనీ, ఆ రీసర్వే విఆర్‌ఒ లాగిన్ వరకూ వచ్చి ఆగిపోయిందని, 13వ నోటిఫికేషన్ పూర్తికాకపోవడంతో సీసీఎల్ఎ ఆదేశాలు మేరకు మరోసారి రీ సర్వే చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ డి. రాజేశ్వరరావు, విఆర్‌ఒలు, సచివాలయ సర్వేయర్లు, గ్రామ సర్పంచ్ ఏసురత్నం, టిడిపి నాయకులు నెట్టి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

గోతులను పూడ్చండి

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి రోడ్లు మృత్యు మార్గాలుగా మారయని వెంటనే రోడ్లపై ఏర్పడ్డ గోతులను పూడ్చాలని కొప్పలవెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, మున్సిపాలిటీ అధికారులు కలిసి తక్షణం బొబ్బిలిలో శిథిలమైన రోడ్లు నిర్మించాలన్నారు. రోడ్లపై లైట్లు వేయాలని, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని, బొబ్బిలి ఆసుపత్రిని 100 పడకలతో ఆధునికరించాలని కోరారు. బొబ్బిలి మున్సిపాలిటీ, మండల పరిధి రోడ్లన్నీ శిథిలమై ఉన్నందున ప్రజలు అకాల మరణాలకు గురవుతున్నారన్నారు. గతంలో యువ ఇంజినీర్ రాకేష్, మల్లంపేట యువకుడు కర్రి రాకేష్, శనివారం, మల్లంపేట యువకుడు తెంటు చంద్రమౌళిలతో పాటు ఈ గోతులు, గతకులు రైడ్లుపై అనేకమంది అకాల మరణాలకు గురయ్యారన్నారు. ఇలాంటి మృతుల తల్లులు, కుటుంబాల గుండె కోత, జీవన విషాదాలు నిత్యకృత్యంగా సాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, మున్సిపాలిటీ అధికారులు బొబ్బిలి రోడ్లును బాగుచేయాలని కోరారు.

ఆక్రమణలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - రామభద్రపురం


దుకాణాలను తొలగిస్తున్న జెసిబి

మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్ నుంచి 3 రోడ్లు కూడలి వరకు దశాబ్దాలుగా ప్రజలు, ప్రయాణీకులు పడ్డ ట్రాఫిక్ కష్టాలకు నేటితో తెరపడినట్లు అయ్యింది. ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు బుదవారం ఉదయమే తహశీల్దార్ సులోచనారాణి, రెవెన్యూ సిబ్బంది జెసిబి, టిప్పర్‌లు తీసుకొని వచ్చి ఆక్రమణ చేసి నిర్మించిన దుకాణాలను తొలగించారు. దీంతో మిగతా వారు కూడా ఆక్రమణకు గురైన స్థలాన్ని ఖాళీ చేసేందుకు ముందుకు వచ్చి సహకరించారు. రోడ్డుకు రెండు వైపులా 50 అడుగుల స్థలాన్ని ఖాళీ చేయించడం విశేషం. దీనివల్ల రోడ్డు సువిశాలంగా సిద్ధం కానుంది. ఇక ట్రాఫిక్ కష్టాలకు విముక్తి లభించిందని ఆనంద పడుతున్నారు. ఎస్ఐ ప్రసాదరావు ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా శాంతిభద్రతలు పటిష్టం చేసారు. ఆర్ అండ్‌బి అధికారులు సమన్వయంతో తొలగింపు చర్యలు పర్యవేక్షించారు. మొత్తం మీద ఆక్రమణల తొలగింపు ప్రశాంతంగా కొనసాగుతుంది.

గ్రామాల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

ప్రజాశక్తి - రామభద్రపురం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక శ్రీరామ్ నగర్ కాలనీలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మౌళిక సౌకర్యాలు, ఉచిత భోజనం, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ప్రభుత్వ పాఠశాలలకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లతో పెద్ద ఎత్తున ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ప్రచారం చేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అధిక మార్కులు సాధించారని తెలిపారు. వీటిపై ఉపాధ్యాయులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు ఒకటో తరగతి ప్రవేశాలకు సుమారు 300 మందిని గుర్తించి రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడిలో చేర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామనగర్ కాలనీ ప్రధానోపాధ్యాయులు శివరాంనాయుడు, సిఆర్పి రవికుమార్ పాల్గొన్నారు.

ఈ-సేవ రుసుములకు టోకరా

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ ఈ సేవ రుసుములకు టోకరా వేశారు. ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా తమ సొంతానికి ఈ సేవ సొమ్ము సుమారు రూ.6లక్షలను వాడుకున్నారు. కులం, ఆదాయం, వన్‌బి, ముటేషన్లకు, అడంగల్, పోలీస్ సర్టిఫికెట్లు వెరిఫికేషన్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికేట్ తదితర ధ్రువపత్రాలకు చెల్లించిన సొమ్ము సుమారు 6లక్షల వరకు బకాయి కనిపించడంతో మండల అధికారులకు అనుమానం వచ్చి ఆరా తీశారు. ఈ నగదును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణను వివరణ కోరగా బానాది సచివాలయం డిజిటల్ సహాయకుడు నుండి ఇప్పటి వరకు బకాయి ఉన్న సొమ్మును రికవరీ చేస్తున్నామన్నారు. లాగిన్ నుండి కూడా తప్పించి ఆయన జీతాన్ని కూడా ఆపివేశామన్నారు. ఎక్కడికి వెళ్లినా బకాయిపడిన సొమ్మును రికవరీ చేస్తామని చెప్పారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కెవి వ్యసాయం కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున ఈ నెల 15న (గురువారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఈఈ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్ స్టేషన్ పరిధిలో రామతీర్థం 11కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్మాణపనుల కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతరిమి, పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బొడ్డపేట, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.